
సాక్షి శ్రీకాకుళం

మంగళవారం ; 1 ; ఆగస్టు ; 2023



'లంపీ స్కిన్'ను ఎదుర్కొనేందుకు..

లంపీ స్కిన్‌ను ఎదుర్కొనేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పశువులకు టీకాలు వేయనుంది. - 8లో



దారుణ హత్య

అనకాపల్లిలో శ్రీకాకుళం వాసి దారుణ హత్యకు గురయ్యాడు. ఆ జిల్లాలోని కొత్తపేటలో ఘటన జరిగింది. - 8లో

నేటి నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం కేంద్రంగా వర్సిటీ క్యాంపస్, ఆరు పీజీ అఫిలియేషన్ కళాశాలల విద్యార్థులకు పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళ వారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 నుంచి 1 గంట వరకు పరీక్షలు నిర్వహించను న్నారు. 23 కోర్సుల నుంచి 612 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

న్యూస్‌రీల్

3న ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ఎచ్చెర్ల, డీఎల్ టీసీ, పలాస ప్రభుత్వ ఐటీఐలు, 18 ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు ఈ నెల 3వ తేదీన రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ఐటీఐ ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు చెప్పారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో సోమవారం వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు. దరఖాస్తు చేస్తున్న విద్యార్థులు తాము దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. మొదటి విడతలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్పందనకు 200 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. సమస్యలకు పరిష్కారం చూపించే బాధ్యత అధికారులపై ఉందనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా స్పందనకు మొత్తం 200 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ మురళీకృష్ణ, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట్ రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరం డిపాజిట్లు ఇప్పించి కాపాడాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లా గౌరవ అధ్యక్షుడు సనపల నరసింహులు వినతిపత్రం ద్వారా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు శ్రీకాకుళంలోని ఎన్జీవో హోం నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈనెల 15 లోపు డిపాజిట్లను చెల్లించకుంటే తాము ఈ నెల 30 న చలో విజయవాడకు పిలుపునిస్తామని అన్నారు.

ఎస్పీ స్పందనకు 40 అర్జీలు



మహిళ సమస్య వింటున్న అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : పోలీస్ స్పందనకు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం జరిగేలా చూస్తామని అదనపు ఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలు భరోసా ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారుల నుంచి 40 అర్జీలు అందాయి. ఈ మేరకు అదనపు ఎస్పీలు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి గోడు విన్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించి వారంలోగా నివేదిక తమకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం



పిన్నింటిపేట సచివాలయ సెక్రటరీ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పోలాకి: జిల్లాలో ఎన్నికల విధుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పోలాకి మండలంలోని కోడూరు, డీఎల్‌పురం సచివాలయాల పరిధిలోని పోలింగ్‌కేంద్రాల్లో 'హౌస్ టు హౌస్ వెరిఫికేషన్' ప్రక్రియ జరుగుతున్న తీరును కలెక్టర్ సోమవారం పరిశీలించారు. మాన్యువల్ రికార్డులు సక్రమంగా లేకపోవటంతో పాటు వెరిఫికేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఆఖరి గడువు తేదీ నాటికి లక్ష్యాలను ఎలా చేరుకుంటారని, పర్యవేక్షించాల్సిన అధికారులకు సైతం నోటీసులు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. పిన్నింటిపేట సచివాలయం సెక్రటరీ సురేష్, డీఎల్ పురం సచివాలయం ఇన్‌చార్జి సెక్రటరీ హరిప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కాశీవరప్రసాద్‌లను సస్పెండ్ చేయాలని ఆదేశాలు జారీచేశారు. మొత్తం పోలింగ్‌బూత్‌లలో వెరిఫికేషన్ ప్రక్రియ తీరుపై నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీరాములును కలెక్టర్ ఆదేశించారు.

స్వయం ఉపాధికి ఊతం



కోటబొమ్మాళిలో మహిళలకు కంప్యూటర్ శిక్షణ

- సత్యసాయి ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ సేవలు
- జిల్లాలో నాలుగు కేంద్రాల్లో నిర్వహణ
- కంప్యూటర్, మగ్గం వర్క్, టైలరింగ్‌లపై శిక్షణ



శ్రీకాకుళం కల్చరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ ఇచ్చి వారి బతుకులకు ఓ బాట చూపిస్తోంది సత్యసాయిసేవా సమితి. పని కోసం ఇతర ప్రాంతాలకు ఎవరూ వలస వెళ్లకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ వృత్తి శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తోంది. మొదటిగా తాడిపత్రిలో 2014లో శాశ్వత ఉచిత వృత్తి విద్యా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఆమదాలవలస, శ్రీకాకుళంలోని సాయిగణేష్ మందిరం, కోటబొమ్మాళి, నరసన్నపేటలో ఈ శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది తమ కాళ్లపై తాము నిలబడి మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ నాలుగు కేంద్రాలలో టైలరింగ్ ద్వారా 13 బ్యాచ్‌లు నిర్వహించి 404 మందికి ఉపాధి అవకాశం కల్పించారు. మగ్గం వర్కులో ఒక బ్యాచ్ నిర్వహించగా 14మందికి, కంప్యూటర్‌లో 9బ్యాచ్‌లు నిర్వహించి 160మందికి, ప్లంబింగ్‌లో ఒక బ్యాచ్‌లో 12మందికి, ఏసీ రిపేరులో ఒక బ్యాచ్ ద్వారా 40 మందికి స్వయం ఉపాధి శిక్షణ అందించారు. మొత్తంగా 23 బ్యాచ్‌లు నిర్వహించి 604 మందికి ఉపాధి మార్గాలు చూపించారు. పట్టణంలోని కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న సాయి గణేష్ మందిరంలో టాలీ విత్ జీఎస్టీ, టైలరింగ్ కోర్సు, బ్యాంకర్స్ కాలనీలో ఏసీ, రిఫ్రిజిరేటర్స్ రిపేరు వర్క్, మగ్గం జరదొసి కోర్సు నిర్వహిస్తున్నారు. ఆమదాలవలసలోని లక్ష్మీనగర్‌లో టైలరింగ్ కేంద్రం అలాగే మగ్గం వర్కు నిర్వహిస్తున్నారు. నరసన్నపేటలోని మారుతీ నగర్‌లో టైలరింగ్ కోర్సు, కోటబొమ్మాళిలో బేసిక్ కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్ నేర్పుతున్నారు.



బ్యాంకర్స్ కాలనీలో మగ్గం వర్క్‌పై శిక్షణ

ఏసీ రిపేర్ వర్క్ నేర్చుకున్నా



శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీ సత్యసాయి మందిరంలో ఏసీ రిపేర్ వర్కు నేర్చుకొని కాశీబుగ్గలో సొంతంగా షాపు పెట్టుకున్నాను. నా వద్ద ఇద్దరు పని చేస్తున్నారు. సంపాదన నెలకు రూ.25వేల వరకు వస్తోంది. - ఢిల్లీరావు, కాశీబుగ్గ

నెలకు రూ.30వేలు వస్తోంది



నేను బ్యాంకర్స్ కాలనీలోని సాయి మందిరంలో మగ్గం వర్క్ నేర్చుకున్నాను. ప్రస్తుతం సీజన్‌లో నెలకు రూ.30వేలు, అన్ సీజన్‌లో నెలకు రూ.10వేలు సంపాదిస్తున్నాను. - ఉమా, శ్రీకాకుళం

బ్యాంకు సహకారంతో..



నేను కోటబొమ్మాళి ఉపాధి శిక్షణ కేంద్రంలో మగ్గం, జరదొసి వర్క్ నేర్చుకున్నాను. టెక్కలిలో మగ్గం వర్క్ చేస్తూ యూనియన్ బ్యాంకు అందజేసిన రూ.5లక్షల లోనుతో కంప్యూటర్ కొని దాని మీద కూడా పనిచేస్తున్నాను. నెలకు రూ.35వేలు వరకు సంపాదిస్తున్నాను. మరో ముగ్గురికి శిక్షణ కూడా ఇచ్చాను. - శ్రీదేవి, టెక్కలి

శ్రీకాకుళమే ఫస్టు



జిల్లాలో వృత్తి విద్యాకోర్సుల ద్వారా ఉపాధి పొందిన వారు ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రంలోనే ఈ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. - ఆర్.లక్ష్మణరావు, రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు

● ఉభాల వేళ..



పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పొలంలో దిగారు. వ్యవసాయ కూలీలతో కలిసి నాట్లు వేశారు. ఆమె సోమవారం అటుగా వెళ్తూ మాకనాపల్లి వద్ద మహిళలు నాట్లు వేస్తుండడం చూసి వారి వద్దకు వెళ్లి తానూ పొలంలోకి దిగారు. అన్నదాత సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని అన్నారు. రైతుల క్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. - మెళియాపుట్టి

ఇంటింటికీ తాగునీటి సదుపాయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఇంటింటికి తాగునీటి కుళాయి కార్యక్రమాన్ని శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో కొర్లకోట గ్రామంలో రూ. 1.37 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జలజీవన్ మిషన్ ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు, రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ వాటర్ ట్యాప్ కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందిస్తామన్నారు. తాగునీటి బోరులు, బావులు వద్ద మహిళలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమని, ఇలాంటి కష్టాలు గ్రామాల్లో ఇక ఉండవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్ సనపల అన్నపూర్ణమ్మ, ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, సచివాలయాల మండల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మూడుదశల్లో మిషన్ ఇంద్రధనుష్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూడు దశల్లో నిర్వహించనున్న మిషన్ ఇంద్ర ధనుష్ విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మిషన్ ఇంద్ర ధనుష్ బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొటీన్ ఇమ్యునైజేషన్‌లో టీకాలు తీసుకోని ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. దీని కోసం జిల్లాలో జూలై 19 నుంచి 24 మధ్య ఆశ వర్కర్లు నిర్వహించిన సర్వేలో సుమారు 500 మంది పిల్లలు, 88 మంది గర్భిణులను గుర్తించామన్నారు. వీరందరికీ ఆగస్టు 7 నుంచి 12, సెప్టెంబర్ 11 నుంచి 16, అక్టోబర్ 9 నుంచి 14 వరకు టీకాలు వేస్తామన్నారు. జిల్లాలో 732 సచివాలయాల పరిధిలో గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీకాలు వేస్తారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, డీఐఓ డాక్టర్ ఆర్వీఎస్ కుమార్ పేర్కొన్నారు.

ఎన్నికలకు సమాయత్తమవుదాం

- మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు



ప్రసంగిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస: రానున్న ఎన్నికల్లో గెలుపు కాదు భారీ మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని, సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానాన్ని ఓట్లుగా మలచుకోవాలని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలోని ప్రగతిభవన్‌లో సోమవారం సాయంత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా ఆరు నెలలు మాత్రమే సమయం ఉందని, ఇప్పటి నుంచే మనమంతా ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ పరిధిలో కనీసం 100 ఓట్లకు తగ్గకుండా మనకు మెజారిటీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. మేనిఫెస్టో హామీలు నెరవేర్చామని చెబుతూ ఎన్నికలకు వెళ్తున్నామని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.700 కోట్లతో మంచినీటి ప్రాజెక్టు, రూ.200 కోట్లతో కిడ్నీ ఆస్పత్రి, రూ.400 కోట్లుతో ఆఫ్‌షోర్ రిజర్వాయరుతో పాటు పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రెండు లైన్ల రోడ్లు వేశామని వివరించారు. ఒక మున్సిపల్ కౌన్సిలర్ స్థాయి ఉన్న వారు ఆఫ్‌షోర్ వద్దకు వెళ్లి సెల్ఫీలు తీయడం హాస్యాస్పదంగా ఉందని చురకలు అంటించారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమాని రెండు సార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి తెలుగుదేశంలో చేరి బానిసగా బతకడం సిగ్గుచేటన్నారు. పార్టీ పలాస మండల అధ్యక్షుడు, పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, వైస్ ఎంపీపీలు తలగాన శ్రీరాములు, సవర దాలమ్మ, జెడ్పీటీసీ మచ్చ ధనరాజు రత్నాలు, ఏఎంసీ ఉపాధ్యక్షురాలు జినగ లోకేశ్వరి, పార్టీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, జె.సి.ఎస్ కన్వీనర్ దువ్వాడ రవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొర్ల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ పింఛన్ భరోసా పథకంలో భాగంగా పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ పింఛన్లను మంగళవారం ఉదయం వలంటీర్లు లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,11,502 మందికి గాను రూ.84.36 కోట్ల నగదు విడుదలైనట్లు తెలిపారు.

త్వరితగతిన రోడ్డు పనులు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ధర్మాన హయాంలో శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే నాలుగు వంతెనలు నిర్మించి పొన్నాడ, ఎచ్చెర్ల ప్రాంతవాసులకు శ్రీకాకుళం నగరానికి అనుసంధానం చేశారు. అంతేకాకుండా నగరంలో 80 అడుగుల రోడ్డు, పాలకొండ రోడ్డు అభివృద్ధి వంటివి కూడా జరిగాయి. తాజా పలు రహదారుల నిర్మాణాలకు సంబంధించి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే ప్రభుత్వ భవనాలు గవర్నమెంట్ ఐటీఐ, కోర్టు ప్రాంగణ, పరిశ్రమల శాఖ కార్యాలయాల కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళం డే అండ్ నైట్ నుంచి ఆమదాలవలస వరకూ నిర్మిస్తున్న ఎనభై అడుగుల రహదారి పనుల్లో భాగంగా వివిధ ప్రభుత్వ భవనాల ప్రహరీలు తొలగించనున్నారు. వాటి స్థానంలో కొత్త ప్రహరీల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయి. కొత్త హద్దులకు అనుగుణంగా కొత్త ప్రహరీల నిర్మాణానికి రూ 1.10కోట్లుతో పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలని మంత్రి ధర్మాన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్‌అండ్‌బీ ఎఈ గణపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, యువజన విభాగం అధ్యక్షులు ఎంవీ స్వరూప్, కోణార్క్ శ్రీను, చల్లా శ్రీనివాస్, మండవిల్లి రవి, గణపతి పట్నాయక్, అంధవరపు సంతోష్, రఫీ, ఎండ రమేష్, టంకాల బాలకృష్ణ, సుంకరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు మృతదేహం వెలికితీత



రైతు మృతదేహాన్ని తీసుకువస్తున్న దృశ్యం

పోలాకి: పోలాకి పెద్దగెడ్డలో గుర్రపుడెక్క తొలగింపునకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతైన రైతు ముప్పిడి శాంతారావు మృతదేహాన్ని సోమవారం ప్రత్యేక బృందాలు వెలికితీశాయి. గల్లంతైన చోటు నుంచి 600 మీటర్ల దూరంలో మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అధికారులు అప్పగించారు.

అమ్మ పాలు.. అమృతపు జల్లు



- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- తల్లిపాలను మించిన పౌష్టికాహారం లేదు
- తల్లిపాల విశిష్టతపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: 'గర్భ'గుడి నుంచి బయట వచ్చిన శిశువు గొంతులో అమ్మ ఆశీర్వాదంగా దిగే తొలి పాలచుక్కలు అమృతంతో సమానమని వైద్యులంటారు. మారుతున్న కాలంలో డబ్బా పాలకు అలవాటు పడుతున్న వారు ఎక్కువవుతున్న క్రమంలో తల్లిపాల విశిష్టతను అమ్మలకు, కాబోయే తల్లులకు వివరించేందుకు ఏటా ఓ వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తల్లిపాల వారోత్సవాల పేరిట నిర్వహించే కార్యక్రమాలు జిల్లాలో మంగళవారం నుంచి మొదలు కానున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలను ఆగస్టు 7వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్నారు.

పుట్టిన నాటి నుంచి..

బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలి. ఆరు నెలల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. తల్లిపాలు శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8–10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీంతో ఎలాంటి వ్యాధులు దరి చేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది.

ముర్రుపాలు తప్పనిసరి

- బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలను ముర్రుపాలు అంటారు.

ప్రయోజనాలు

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రొటీన్లు, ఒమెగా 3.6 అలాగే 9 బిడ్డ మెదడు వికాసానికి తోడ్పడుతుంది.
- ఇందులోని లాక్టోజ్‌తో కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులకు వివిధ రకాల అంటు వ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- తల్లి పాలతో బిడ్డలకు డయేరియా, నిమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బులు వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.
- బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

- ఇవి రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందజేస్తాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్ 'ఎ' ఉంటుంది.
- వ్యాధులు రాకుండా ముర్రుపాలు బిడ్డను జీవిత కాలం కాపాడుతాయి.
- శిశువు ప్రేగులను శుభ్రం చేసి, మొదటి మల విసర్జనకు తోడ్పడుతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావడం లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు పలుచని తేనె నాకించడం, పంచదార నీళ్లు ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్లు ఇవ్వడం చేయకూడదు.

తల్లికీ లాభమే..

- తల్లులు చనుబాలు ఇవ్వడంతో గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు.
- చనుబాలు ఇచ్చే వారికి ఊబకాయం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.
- బిడ్డకు పాలు పట్టించడంతో రొమ్ము, గర్భ సంచి క్యాన్సర్లు వచ్చే అవకాశాలు చాలా తక్కువ.
- తల్లులకు మలి వయసులో వచ్చే అస్టియోపొరొసిస్(ఎముకల బలహీనం) నుంచి కాపాడుతుంది.
- తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు కూడా పాలు పట్టించవచ్చు.

ఎంతో శ్రేష్ఠమైనవి



తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవి. అందుకే తల్లిపాల ఆవశ్యకతను తెలియపరిచేందుకు ఏటా తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం. ఈ సందర్భంగా ప్రతి ప్రాజెక్ట్ స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు స్థానిక వైద్య సిబ్బందితో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ, ర్యాలీలు నిర్వహిస్తాం. - జి.జయదేవి, పీడీ, ఐసీడీఎస్, శ్రీకాకుళం

శిశువుకు ఆరోగ్యం



తల్లీబిడ్డకు మధ్య అనుబంధాన్ని పెంచేవి తల్లిపాలు. తల్లిపాలు శిశువుకు ఆరోగ్యంతో పాటు అత్యంత సురక్షితం. బిడ్డకు తల్లి పాలు ఇవ్వ డం ద్వారా బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు, విటమిన్స్, మినరల్స్, ప్రొటీన్స్ లభిస్తాయి. ముఖ్యంగా శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. - డాక్టర్ రేవతి భేరి, ప్రభుత్వ వైద్యాధికారి, ఇచ్ఛాపురం మండలం



తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ ఇచ్ఛాపురం మండలంలో ర్యాలీ(ఫైల్)

క్లుప్తంగా

డిగ్రీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ అనుబంధ కళాశాలల 2, 4 సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 17వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల పరీక్షలు నిర్వహిస్తున్నారు. వర్సిటీ పరిధిలో 64 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను విద్యాశాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం మూలపేట గ్రామానికి వచ్చి నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. జీడిమొక్కలు, పీడీఎఫ్ పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరారు. అలాగే ఆర్అండ్ఆర్‌కాలనీలో బోర్లు వేసినా నీరు పడటంలేదని, రోడ్లు బాగు చేయాలని ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈయనతో సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ భరత్‌చంద్రరెడ్డి ఉన్నారు.

'డిలీషన్‌కు డాక్యుమెంట్లు తప్పనిసరి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి డిలీషన్‌కి సంబంధిత డాక్యుమెంట్స్ తప్పకుండా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఆయన సోమవారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 21న కుటుంబాల సర్వే ప్రారంభమైందని, ఇప్పటివరకు చేపట్టిన సర్వేపై సమీక్షించారు. ఓటరు జాబితాలో తొలగించడం, జత చేయడం జరుగుతుందని అందుకు సంబంధించి ప్రతి ఒక్క దరఖాస్తుకి సంబంధించి డాక్యుమెంట్లు అన్నీ అప్‌లోడ్ చేయాలన్నారు. సంతకాలు లేకుండా ఫారాలు అప్‌లోడ్ చేయకూడదన్నారు. ఆగస్టు 21 నాటికి వందశాతం సర్వే పూర్తి కావాలన్నారు. ఈ సర్వేకు వలంటీర్లు వెళ్లకూడదని అన్నారు.

ముగిసిన సేవాదళ్ శిక్షణ శిబిరాలు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా కొలువైన ప్రశాంత నిలయంలో సేవలకు వెళ్లే సేవాదళ్‌కు విధివిధానాలు తెలియజేసేందుకు నిర్వహించిన శిక్షణ శిబిరాలు ఆరు జోన్లలో ముగిశాయని జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట, పలాస, హిరమండలం, శ్రీకాకుళం, నరసన్నపేట జోనల్‌లో శిక్షణలు ముగిసినట్టు పేర్కొన్నారు. పాతపట్నం, టెక్కలి జోన్లలో ఆగస్టు ఆరో తేదీ ప్రారంభమవుతాయని వెల్లడించారు. పుట్టపర్తికి దేశ విదేశాలనుంచి వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందించేందుకు సేవాదళ్ ఏర్పడిందన్నారు. జిల్లానుంచి అధికమంది భక్తులకు శిక్షణ ఇచ్చి సేవాదళ్‌గా రూపొందించామన్నారు. వీరిని ప్రశాంతి నిలయం సేవలకు ఏటా ఆరు పర్యాయాలు పంపిస్తామన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	60,380-00
బంగారం(22కే. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

'లంపీస్కిన్'ను ఎదుర్కొనేందుకు..

- నేటి నుంచి పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు
- ఆగస్టు నెలంతా టీకాలు వేసేందుకు ప్రణాళిక



గార: లంపీస్కిన్.. ఈ పేరు వింటే పాడిరైతులు ఆందోళన చెందుతారు. పాడిపశువులకు వ్యాపించే ఈ వ్యాధిని నాలుగు సంవత్సరాల కిందట శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో గుర్తించారు. తొలుత ఈ వ్యాధిని పశుసంవర్ధకశాఖ అధికారులు, పాడిరైతులు గుర్తించలేకపోయారు. ఆ తరువాత కీటకాల ద్వారా అతివేగంగా ఈ వ్యాధి విస్తరిస్తోందని కనుగొన్నారు. లంపీస్కిన్ సోకిన ఆవులను మిగతా వాటితో ఉంచవద్దని అధికారులు హెచ్చరికలు చేశారు. అయితే అప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 12,560 పశువులకు ఈ వ్యాధి సోకగా.. వీటిలో 450 వరకు ఆవులు మృతి చెందాయి. మరణాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ.. ఈ వ్యాధి ఉన్నంత కాలం పాల దిగుబడిలో గణనీయమైన తగ్గుదల ఏర్పడింది. పూర్తిగా పాలుపితకలేని పరిస్థితిని పాడిరైతులు ఎదుర్కొన్నారు.

వైద్యుల ప్రత్యేక దృష్టి..

లంపీస్కిన్ వ్యాధి కీటకాలు, గాలి ద్వారా విజృంభించడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. శాస్త్రవేత్తలు, వైద్యులు ప్రత్యేక దృష్టిసారించి ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి టీకాలు తయారు చేశారు. ఈ టీకాను వోపాక్స్ వ్యాక్సిన్ కనుగొన్నారు. ఇదికూడా వ్యాధి రాకుండా కేవలం ముందస్తు టీకా మాత్రమే. ఈ టీకాలను రాష్ట్రవ్యాప్తంగా పాడిపశువులకు ఉచితంగా వేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



లంపీస్కిన్ సోకకుండా ముందస్తుగా టీకాలను వేస్తున్నాం. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వ్యాధి సోకిన తర్వాత నివారణచర్యలు కాకుండా జాగ్రత్తలు ద్వారానే వ్యాధి తగ్గుముఖం పడుతుంది. వ్యాధిసోకిన ఆవుకు మిగిలిన వాటిని దూరంగా ఉంచడం, పౌష్టికాహారంతో పాటు వైద్యుల సలహా మేరకు మందులు వాడటం వల్లనే వ్యాధి తగ్గుముఖం పడుతుంది. గాలి, కీటకాలు ద్వారానే ఈ వ్యాధి సోకుతుంది. ఉచితంగా టీకాలను వేస్తాం. –గొలివి రాజశేఖర్, శ్రీకాకుళం ఏడీఏ, పశుసంవర్ధక శాఖ.

శ్రీకాకుళం జిల్లాలో ఆగస్టు ఒకటి నుంచి 30వ తేదీ వరకు ఎన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో వేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో 3.65 లక్షల ఆవులున్నాయి. వోపాక్సిన్ వ్యాక్సిన్‌ను పశువైద్యసిబ్బంది గ్రామాలకు వెళ్లి ఉచితంగా వేస్తారు. జిల్లా వ్యాప్తంగా టీకాల కోసం సుమారు 40 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది.

శ్రీకాకుళం వాసి దారుణ హత్య

- కత్తితో గొంతు కోసి చంపేసిన వైనం
- సహచర కార్మికులపైనే అనుమానాలు

రాంబిల్లి (అనకాపల్లి జిల్లా): కొత్తపేటలో దారుణ హత్య చోటుచేసుకుంది. శ్రీకాకుళానికి చెందిన లోపింటి మాధవరావు (23)ను పీక కోసి హత్య చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. నేవల్ బేస్‌లో నిర్మాణ పనులు చేస్తున్న ఎల్ అండ్ టీ సంస్థలో కాంట్రాక్టర్ నారాయణ వద్ద మాధవరావు గత కొన్నాళ్లుగా పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన మరో ఐదుగురు కార్మికులతో కలిసి కొత్తపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మాధవరావు మరణానికి దారితీసిన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు. కాంట్రాక్టర్ నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ గఫూర్, ఎస్ఐ దీనబంధు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించగా, ఒక కార్మికుడి వైపు వెళ్లినట్లు తెలిసింది. దీంతో అదే రూంలో ఉంటున్న ఐదుగురు కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు.

ఉలిక్కిపడ్డ కొత్తపేట

రక్తపు మడుగులో మాధవరావు మృతదేహం పడివుండటం, హత్య జరిగిన ప్రదేశంలో పొడవైన కత్తి దొరకడంతో కొత్తపేటలో భయానక వాతావరణం చోటు చేసుకుంది. మండల వ్యాప్తంగా ఈ వార్త దావానలంలా వ్యాపించింది. వారం రోజుల క్రితం కొత్తపేటలో ఒక కార్మికుడిని మరో కార్మికుడు చాకుతో కడుపులో పేగు బయటకు వచ్చేలా పొడిచిన విషయం తెలిసిందే. ఆ సంఘటన మరువక ముందే ఇది చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మాధవరావు మృతదేహం



మాధవరావు(ఫైల్)

పరీక్షల పర్వం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: కొత్త విద్యా సంవత్సరంలో పరీక్షల పర్వం మొదలుకానుంది. జూన్, జూలై మాసాల్లో జరిగిన సిలబస్‌లకు సంబంధించి విద్యార్థుల అభ్యసన మదింపు, సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఆగస్టు 1వ తేదీ నుంచి పాఠశాలల్లో పరీక్షలు మొదలుకానున్నాయి. గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ (సీబీఏ) పేరుతో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ఏర్పాట్లు చేసింది. గత ఏడాది మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9,10 తరగతుల వారికి ఫార్మేటివ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేశారు.

'ద్విభాషా' విధానంలో ప్రశ్నపత్రాలు..

సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యార్థులకు ప్రశ్నపత్రం సులువుగా అర్థమయ్యేందుకు బైలింగ్విల్ (ద్విభాష) విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. విద్యార్థికి ఇంగ్లీషులో ప్రశ్న అర్థం కాకుంటే తెలుగులో చదివి అర్థం చేసుకునేందుకు గత ఏడాది నుంచి ద్విభాషా విధానంలో ప్రశ్నపత్రాలు ప్రవేశపెట్టారు. ఇందులో 10 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో, ఐదు ప్రశ్నలు రాతపూర్వక విధానంలో ఇస్తారు. మొత్తం 15 ప్రశ్నలకు 20 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ విద్యార్థి మేథస్సును సమగ్రంగా అంచనా వేసేలా ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు తమ సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల విద్యా మాత్రం రాతపూర్వక సమాధానాలు రాస్తే సరి పోతుంది.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజయవాడకు చెందిన న్యాయవాది రాయసం విఠల్‌రావు దారుణ హత్యకు ఇటీవల గురయ్యారు. దీన్ని నిరసిస్తూ జిల్లా న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. అద్దంకి కోర్టుకు హాజరై.. పనిముగించకుని వస్తుండగా మాటువేసి న్యాయవాదిని అతిదారుణంగా చంపి తుప్పల్లో పాతిపెట్టిడంపై విచారం వ్యక్తం చేశారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని.. వీటిని తీవ్రంగా ఖండించాలని బార్ అసోసియేషన్ ఆధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, అందుకు చట్టం తీసుకురావాలని కోరారు. అనంతరం సమావేశమై పలు తీర్మాణాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, సభ్యులు హరిప్రియ, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు చౌదరి లక్ష్మణరావు, కూన అన్నం నాయుడు, శిష్టు రమేష్, సువ్వారి తవిటినాయుడు, పి.మల్లిబాబు ఉన్నారు.

ఆరోగ్యమిత్రకు ప్రశంసాపత్రం అందజేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నానికి చెందిన ఆరోగ్యమిత్ర నెయ్యల సింహాచలం వైద్యం కోసం వచ్చే ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు విశేష సేవలు అందిస్తున్నారు. ఈయన సేవలను గుర్తిస్తూ 2023 సంవత్సరానికిగాను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలు అమలులో ఆరోగ్య మిత్రలు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌చార్జి డీఆర్వో మురళీకష్ణ, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పాగిరి ప్రకాశరావు పాల్గొన్నారు.



సింహాచలానికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బి. లాఠకర్

ఉమాజఠలేశ్వరుడుకి ప్రత్యేక పూజలు



పూల అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో వేంచేసిన ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అర్చకులు అశ్విని కుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళ జలాభిషేకాలు చేపట్టారు. అనంతరం పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యంలో భక్తులు స్వామి దర్శించుకున్నారు.

మృత్యుంజయుడు!

- చెరువులో మునిగిపోయిన బాలుడు
- కాపాడిన యువకులు



చికిత్స పొందుతున్న రాహుల్

కోటబొమ్మాళి: చెరువులో మునిగిపోయిన బాలుడ్ని ఇద్దరు యువకులు కాపాడి ప్రాణభిక్ష పెట్టారు. అయితే ఆ బాలుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి రెడ్డిక వీధికి చెందిన చాప ఆసిక్, రాములమ్మ కుమారుడు రాహుల్ (5) రాహుల్ స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు వెళ్లిన రాహుల్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. తలిదండ్రులు పొలం పనులకు వెళ్లిపోవడంత తోటి పిల్లలతో కలిసి అయ్యప్పగుడి వద్ద ఉన్న యరకయ్య చెరువులో స్నానానికి దిగాడు. ఇటీవల ఉపాధిహామీ పనులు చేపట్టడంతో చెరువులో నీరునిండుగా ఉండటంతో ఈత రాక మునిగిపోయాడు. ఆ సమయంలో చెరువు వద్ద పెద్దవారు ఎవరూ లేకపోవడంతో ఆందోళన చెందిన తోటి పిల్లలు కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి విషయాన్ని చెప్పారు. ఇంతలో అటుగా వస్తున్న యువకులు నందిక అజయ్‌కుమార్, కమ్మకట్ల సురేష్‌రెడ్డి విషయం తెలుసుకొని చెరువులోకి దూకి మునిగిపోయిన రాహుల్‌ను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే కొనఊపిరితో అపస్మారక స్థితికి చేరిన రాహుల్‌ను ద్విచక్ర వాహనంపై స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యుడు పరిస్థితి చేయిదాటిపోయిందని.. తాను చికిత్స చేయలేనని తేల్చి చెప్పేశారు. దీంతో వెంటనే కోటబొమ్మాళిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యసిబ్బంది స్పందించి చికిత్స ప్రారంభించారు. ఆక్సిజన్ పెట్టారు. శరీరఉష్ణోగ్రత తగ్గిపోవడంతో కాళ్లు, చేతులు, శరీరంపైనా గట్టిగాపాముతూ సపర్యాలు చేయడంతో రాహుల్ మెలుకవలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన చికిత్సకోసం 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బాలుడిని కాపాడిన యువకులను స్థానికులు అభినందించారు.



బాలుడిని కాపాడిన యువకులు

మానవత్వం పరిమళించిన వేళ..

- అనాథ శవానికి అంత్యక్రియలు

ఇచ్ఛాపురం: అనాథ శవానికి పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ తెల్లి రామారావు, స్థానిక యువత కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సుమారు 34 ఏళ్ల మతిస్థిమితం లేని వ్యక్తి పట్టణంలో సంతపేట వద్ద ఉంటుండేవాడు. ఈయన సోమవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పట్టణ పోలీసుస్టేషన్ ఎస్సై కె.గోవిందరావుకు తెలియజేశారు. పరిశీలించిన ఆయన కేసు నమోదు చేశారు. అయితే చనిపోయిన వ్యక్తి అనాథ కావడంతో దహన సంస్కారాలు చేసేందుకు ఎవరూ ముందకు రాలేదు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ రామారావు.. స్థానిక యువకులు డి.రాజు, నాగరాజు తదితరుల సహకారంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి హిందూ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. హెచ్‌సీని పట్టణ ఎస్సై, పోలీసులు అభినందించారు.



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రామారారావు తదితరులు

ఆదిత్యుని దర్శనానికి వచ్చి..

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా విశాఖపట్నానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం విశాఖపట్నం ప్రహ్లాదపురానికి చెందిన 67 ఏళ్ల వృద్ధుడు ఏఎస్ఎన్ మూర్తి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి నగరానికి వచ్చాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణానికి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరాడు. ఒక్కసారిగా వాంతులు కావడంతో రోడ్డు మీదనే కుప్పకూలిపోయాడు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావును వివరణ అడగ్గా ఇది సహజ మరణమని, మృతుని కుమార్తె, బంధువులు రావడంతో మృతదేహాన్ని అప్పగించామని తెలిపారు.



రోడ్డు మీదే కుప్పకూలిన విశాఖ వాసి

హత్య కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: హత్య కేసులో రాజాంకు చెందిన నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను న్యాయస్థానం విధించింది. రాజాంలో 2018 సెప్టెంబర్ 17వ తేదీన కొండేటి అప్పారావు (65)పై అదే గ్రామానికి చెందిన కొండేటి పోలీస్, కొండేటి రమణ, చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీల దాడికి తెగబడ్డారు. ఈ దాడిపై మృతుడి బంధువులు కనకరాజు, మహేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. దాడి అనంతరం అప్పారావు చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో ఈ ఐదుగురిపై రాజాం పోలీసులు కేసును నమోదు చేసి, దర్యాప్తు చేశారు. కోర్టులో హాజరు పరచగా చావుకు ఐదుగురు బాధ్యులని రుజువు కావడంతో కొండేటి రమణ, కొండేటి చిన్నారావు, కొండేటి గౌరి, కొండేటి సుశీలకు పదేళ్ల కఠిన కారాగార శిక్షను మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి బి.భాస్కరరావు తీర్పునిచ్చారు. మరో ముద్దాయి కొండేటి పోలీసు ఇటీవల మృతి చెందారు. దీంతో నలుగురికి శిక్ష ఖరారు చేశారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్షను అమలు చేయాలని తెలిపారు. అలాగే వేర్వేరు సెక్షన్ల కింద ఈ నలుగురికే మరో రెండేసి సంవత్సరాల పాటు కారాగార శిక్ష వేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పునిచ్చారు. ఈ కేసు దర్యాప్తు రాజాం సీఐ వేణుకుమార్, వేణుగోపాలరావు చేయగా, ఫ్యామిలీ కోర్టు పీపీ వాన కృష్ణ చంద్ వాదించారు.

ఒడిశాకు మరిన్ని సర్వీసులు!

- కొత్తగా విశాఖ నుంచి ఏడు బస్సులు
- ఇకపై అక్కడ నైట్ హాల్టులకూ వీలు
- ట్యాక్స్, పర్మిట్ల భారం నుంచి వెసులుబాటు
- ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన కొత్త ఒప్పందం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం నుంచి ఒడిశాకు ఆర్టీసీ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నుంచి ఆ రాష్ట్రానికి 14 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇకపై కొత్తగా మరో ఏడు బస్సులను ప్రవేశపెట్టేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందంతో బస్సుల సంఖ్య పెంచేందుకు వీలవుతోంది. దీంతో ఒడిశాలోని జైపూర్, నవరంగ్‌పూర్, ఒనకఢిల్లీ, పర్లాకిమిడిలకు ఒక్కోటి చొప్పున, గుణుపూర్‌కు మూడు బస్సులను కొత్తగా నడపనున్నారు. ప్రస్తుతం గుణుపూర్‌కు మూడు, జైపూర్‌కు మూడు, పర్లాకిమిడికి రెండు, రాయగడకు ఒకటి, ఒనకఢిల్లీకి ఒకటి, దామన్‌జోడికి రెండు, నవరంగ్‌పూర్‌లకు రెండు చొప్పున నడుస్తున్నాయి. కొత్తగా ప్రారంభించబోయే వాటితో విశాఖ నుంచి ఒడిశాకు నడిచే బస్సుల సంఖ్య 21కి చేరనుంది. ఈ సర్వీసులను వివిధ ప్రాంతాల వారికి అనువుగా ఉండేలా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా వేర్వేరు రూట్లలో నడుపుతారు. ఈ రూట్లలో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసులను మాత్రమే తిప్పుతారు. ఈ కొత్త సర్వీసులను నిజ శ్రావణ మాసంలో ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు.

తప్పనున్న పన్నుల భారం

ఇన్నాళ్లూ మన ఆర్టీసీ బస్సులు ఒడిశాలో తిరగాలంటే ఆ రాష్ట్రంలో కూడా పన్నులు చెల్లించాల్సి వచ్చేది. అంతేకాదు.. ఎన్నిసార్లు తిరిగితే అన్ని సార్లూ పర్మిట్లు పొందాలి. దీనివల్ల మన ఆర్టీసీకి ఆర్థికంగా భారమయ్యేది. అయినప్పటికీ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఒడిశాకు బస్సులు నడుపుతున్నారు. ఒప్పందంలో భాగంగా ఇకపై ఏ రాష్ట్రం బస్సులు ఆ రాష్ట్రంలో పన్నులు చెల్లిస్తే చాలు. పైగా ఒక పర్మిట్‌తో ఎన్ని ట్రిప్పులైనా తిరగవచ్చు. ఇలా పన్నులు, పర్మిట్ల భారం నుంచి ఏపీఎస్ఆర్టీసీకి వెసులుబాటు కలగనుంది.

ఇకపై నైట్ హాల్టులకు వీలు

ఇన్నాళ్లూ ఏపీఎస్ఆర్టీసీ బస్సులు ఒడిశాలో నైట్ హాల్టు చేసేందుకు అనుమతి లేదు. అందువల్ల ఏ బస్సైనా రాత్రికి తిరిగి వచ్చేయాల్సి వస్తోంది. కొత్త ఒప్పందం ప్రకారం ఇకపై ఒడిశాలో మన బస్సులు రాత్రి వేళ నైట్ హాల్టు చేసేందుకు వీలుంటుంది. దీంతో రాత్రి నైట్‌అవుట్‌కు వీలు కానందున ఇప్పటిదాకా ఒడిశాకు ఉదయం పూట బయల్దేరి సాయంత్రానికి/రాత్రికి వచ్చేసేవి. ఇక మీదట నైట్ హాల్టు వెసులుబాటుతో పగలు, రాత్రిళ్లు కూడా విశాఖ నుంచి ఒడిశాకు నడపనున్నారు. ఫలితంగా ఒడిశా నుంచి ఆస్పత్రులు, వ్యాపారాల పనులపై ఉదయాన్నే బయల్దేరి అక్కడ నుంచి విశాఖ చేరుకోవడానికి, ఇక్కడ పనులు ముగించుకుని సాయంత్రం, రాత్రి బస్సుల్లో తమ ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో ఉపయుక్తంగా ఉండనుందని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.



అల్ట్రా డీలక్స్ బస్సు